క్లుప్తంగా

నీటి నాణ్యత పరిశీలనకు శాంపిల్స్ సేకరణ

సారవకోట: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వినియోగిస్తున్న నీటి నాణ్యత పరిశీలనకు శాంపిల్స్ సేకరిస్తున్నారు. మండలంలో 95 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతీ కేంద్రం పరిధిలోనూ పాతపట్నంకు చెందిన నీటి పరిశీలన పరిక్ష కేంద్రం సిబ్బంది శాంపిల్స్ సేకరిస్తున్నారు. విడతల వారిగా ఈ శాంపిల్స్‌ను సేకరించి వాటి నాణ్యతను పరిశీలించి, ఏ నీటిని వినియోగించాలో నిర్ధారించనున్నట్లు సంబంధిత సిబ్బంది తెలిపారు.

సర్వే వేగవంతం



సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 పద్మనాభరావు

మెళియాపుట్టి: మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల నమోదు సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నారు. చాపరలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఎంఈఓ-2 పద్మనాభరావు పరిశీలించారు. మెళియాపుట్టి మండలంలో ఇప్పటివరకు 20 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. 0 నుంచి 18 ఏళ్ల వయసుగల పిల్లలను గుర్తించే ప్రక్రియ ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఐఈఆర్టీ సిబ్బంది దీనిపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు చేయడం ద్వారా పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసినట్లు అవుతుందన్నారు. వారికి సదరన్‌లో దరఖాస్తు చేయించి పెన్షన్ వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఐఈఆర్టీలు ఝాన్సీ రాణి, శివప్రసాద్ ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలు

సారవకోట: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ హెచ్.కె.కామాక్షి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. సూపర్‌వైజర్లు పద్మ, సునీత, సీతారత్నం పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట: వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని తురకపేట పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని శ్యామలాపురం పునరావాస కాలనీలో సర్పంచ్ బి.లక్ష్మి ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు, మహిళలు రుతుక్రమం సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బి.గోవిందరావు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో 108 అంబులెన్సు సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేయడం, వైద్య పరికరాలు, మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఈఎంఎస్ ఓఈ జగన్, ఓజేటీ నెయ్యిల కృష్ణ తదితరలు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోతనపల్లి కుసుమ

పలాస: మహత్తర శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటంలో అమరులైన వీరుల మార్గమే నేటి యువతరానికి మార్గదర్శకం కావాలని విప్లవ కమ్యూనిస్టు నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం రాత్రి వివిధ విప్లవ గ్రూపులకు చెందిన నాయకులు, ప్రజలు, ఆ పార్టీ అభిమానులు అమరుల స్మారక సభను ఘనంగా నిర్వహించారు. అనంతరం అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ నాయకురాలు పోతనపల్లి కుసుమ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా నాయకుడు గౌరకల బాలకృష్ణ, లిబరేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్



ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధి మెట్టెక్కివలస ప్రాంతంలో ఉన్న కుప్పిలివీధిలో ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్, ఫ్లాగ్ మార్చ్‌ను మంగళవారం నిర్వహించారు. ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించి, ఎటువంటి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తగిన పత్రాలు కలిగి ఉండాలని లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కాలనీలో ఎటువంటి తగాదాలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో ఉండాలని సూచించారు. ఎన్నికల ముగిసిన తరువాత అందరూ స్నేహితులుగా మెలగాలన్నారు. - ఆమదాలవలస రూరల్

పోటెత్తిన భక్తులు



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో వైశాఖమాసం మంగళవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి ఘటాలతో మొక్కులు చెల్లించారు. పాతపట్నం సమీపంలో ఉన్న కొదూరు, ప్రహరాజపాలెంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో ఆలయానికి ఆ గ్రామస్తులు పోటెత్తారు. పలువురు వాహన పూజలు కూడా చేపట్టారు. - పాతపట్నం

మామిడి పండుగ



తరతరాలుగా గిరిజనులు వారి సంప్రదాయాలను పాటిస్తూ వస్తున్నారు. అందులో ముఖ్యమైనది మామిడి పండుగ. మెళియాపుట్టి మండలంలోని హీరాపురం గ్రామంలో మంగళవారం గిరిజనులు వారి ఆచారం ప్రకారం ఈ పండుగను నిర్వహించారు. మూడురోజుల పాటు నిర్వహించిన ఈ పండుగలో గ్రామదేవత ఉజ్జిదమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, ఊరేగింపు కార్యక్రమాలను చేపట్టారు. మూడవరోజు మంగళవారం కొండపైనున్న ఇంజాద్రమ్మ దేవతను దర్శించుకుని మామిడి పండ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం మామిడి పండ్లను గిరిజనులు ఆరగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గిరిజన వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. - మెళియాపుట్టి

ఆర్‌బీకేలు రైతు నేస్తాలు

- విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు సిద్ధం
- ఉన్న ఊరిలోనే అన్ని రకాల వ్యవసాయ సేవలు
- మరికొద్ది రోజుల్లోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభం



రైతు భరోసా కేంద్రం

ఎల్.ఎన్.పేట: విత్తనం కొనుగోలు నుంచి పంట దిగుబడి, విక్రయించేంత వరకు రైతులకు అన్ని రకాల సేవలు రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) నుంచే అందుతున్నాయి. ఇందులో భాగంగా మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలతోపాటు ఖరీఫ్ సీజన్‌కు సరిపడా వరి విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నారు. రైతులకు పంట సాగు సమయంలో అందిస్తున్న సూచనలతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై జీవనం సాగిస్తున్న వారికి రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

తప్పిన తిప్పలు..

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులు పడేవారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పొలం పనులు వదులుకుని విత్తనాలు, ఎరువులు కోసం మండల కేంద్రానికి పరుగులు తీసి రోజంతా తిప్పలు పడేవారు. ఆర్బీకేల ఏర్పాటుతో పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లిస్తే ఊరిలోనే విత్తనాలు, ఎరువులు అందుకుంటున్నారు. రైతులకు సమయంతోపాటు ఖర్చు తగ్గింది.

ఆర్బీకేల ద్వారా సేవలు..

ఆర్‌బీకేల్లో వ్యవసాయ శాఖ నుంచి 28 రకాల సేవలు, పశుసంవర్థక శాఖ ద్వారా 11, మత్స్యశాఖ నుంచి 6, పట్టు పరిశ్రమ ద్వారా 6 రకాల సేవలను పొందవచ్చు. వీటితో పాటు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక రకాల రాయితీ పనిముట్లు అందుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు పంటల నష్టపరిహారానికి సంబంధించిన జాబితాలను ఆర్బీకేల ద్వారా సిబ్బంది సిద్ధం చేస్తారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 91 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఖరీఫ్ వరి సాగుకు సిద్ధం చేస్తున్న పంట భూములు, రైతుల వివరాలు

మండలం	రెవెన్యూ గ్రామాలు	సాగుభూమి (ఎకరాల్లో)	రైతులు
ఎల్.ఎన్.పేట	47	10,850	5,560
మెళియాపుట్టి	70	23,500	6,285
పాతపట్నం	49	18,500	8,895
కొత్తూరు	27	20,900	5,280
హిరమండలం	40	6,650	4,200



పొలాన్ని దుక్కి చేస్తున్న రైతులు

ఆర్బీకేలతో ఎంతో మేలు



రైతు భరోసా కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వెళ్లి రోజంతా క్యూలో కాపుకాసుకుని ఉండాల్సివచ్చేది. ఇప్పుడు విత్తనాలు, ఎరువుల గ్రామంలోని ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటున్నాం. అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా పోయింది.

పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



పాతపట్నం: మాట్లాడుతున్న విద్యార్థి కిరణ్



మెళియాపుట్టి: విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

పాతపట్నం: గ్రంథాలయాలు విజ్ఞాన నియాలని విద్యావేత్త శాసనపూరి మధుబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశం, గ్రంథాలయాల ఉపయోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయాలకు వచ్చి జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలు, ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు, వివిధ రకాల పుస్తకాలను చదవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడించారు. గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, రిసోర్స్‌పర్సన్ కిల్లారి శ్యామ్ బాబు, టి.బెనర్జి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకుందాం

మెళియాపుట్టి: వేసవిలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. చిన్నారుల సృజనాత్మకతకు వేదికగా అనేక పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. నీతికథలు, జనరల్ నాలెడ్జ్, ప్రముఖుల జీవిత చరిత్రలు, ప్రపంచ వింతలు తెలిపే పుస్తకాలు ఉన్నాయన్నారు. ప్రతీ విద్యార్థి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాణ్యతకు పెద్దపీట వేయాలి



బూర్జ: వంట ఏజెన్సీ మహిళలకు సూచనలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు



హిరమండలం: మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

బూర్జ: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా చేవడుతున్న వంటల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని డీఈఓ. కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బూర్జ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పీఎం పోషణ్‌లో భాగంగా మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ మహిళల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. వంటలు రుచికరంగా ఎలా తయారు చేయాలన్న అంశాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. మహిళలకు వంట పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మార్సీకి చేరిన ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను డీఈఓ. పరిశీలించారు. ఎంఈఓలు ఎన్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు, హెచ్ఎం లక్ష్మీనారాయణ, రిసోర్స్‌పర్సన్ బి.ఉత్తర పాల్గొన్నారు.

హిరమండలం: మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని డిప్యూటీ ఈవో విజయకుమారి అన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వారం రోజుల మెనూపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. నిర్వాహకులకు వంటలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈవో రాంబాబు, హెచ్ఎం కేశవరావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మి, రిసోర్స్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన భోజనం పెట్టాలని నరసన్నపేట ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలకు చెందిన కుక్‌లు, ఆయాలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. డీఆర్పీ సాయి శ్రీనివాస్, మడపాం క్లస్టర్ సీఆర్పీ సైలజ పాల్గొన్నారు.

కొత్తూరు: మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు పెడుతున్న భోజనాల్లో పోషక విలువలు ఉండాలని డీఆర్పీ సీతమ్మ అన్నారు. కొత్తూరులో మధ్యాహ్న భోజనం పథకం వంట ఏజెన్సీ మహిళలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వంట ఏజెన్సీ మహిళలకు పలు రకాల వంటలపై పోటీలు నిర్వహించారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



కొరసవాడలో మాట్లాడుతున్న సీఐ సాయి

పాతపట్నం: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని పాతపట్నం సీఐ నల్లి సాయి హెచ్చరించారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ఉందని, ఇందుకు సంబంధించి పార్టీల గెలుపుపై బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తమకు ఎటువంటి సమాచారం వచ్చినా సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్‌కు ముందురోజు ఇదివరకే గుర్తించిన సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ రోజు రాత్రి గ్రామాల్లో నిర్ధేత సమయం దాటిన తర్వాత ఏ ఒక్కరూ మద్యం తాగి తిరుగుతున్నట్లు కనిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

పాతపట్నం: జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సహకరించాలని సీఐ నల్లి సాయి అన్నారు. మండలంలోని కొరసవాడ, కాగువాడల్లో మంగళవారం రాత్రి ఆయా గ్రామాల ప్రజలతో సీఐ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాన్నారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని, గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ



నవధాన్యాల కిట్లును పంపిణీ చేస్తున్న సూర్యనారాయణ

కొత్తూరు: వరి పంట వేయనున్న పొలాల్లో నవధాన్యాలు సాగు చేయడం వల్ల పంటకు మేలు కలుగుతుందని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ఏంటీ సవర సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కారిగూడలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు నవధాన్యాలు కిట్లు రాయితీపై పంపిణీ చేశారు. పచ్చిరొట్ట ఎరువులు కూడా రాయితీపై అందజేస్తున్నామన్నారు. ఎన్ఎఫ్ఏలు ముసలయ్య, గోవింద, చిన్నమ్మి, అప్పారావు, రైతులు పాల్గొన్నారు

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా ఉన్న నివగాం రోడ్డు



వెలవెలబోతున్న కొత్తూరు ప్రధాన రహదారి

ఎండల తీవ్రతకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొత్తూరు మండలంలో మంగళవారం 45 డిగ్రీల సెల్సియస్ తీవ్రతతో ఎండ కాయడంతో ప్రజలు అల్లాడిపోయారు. వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోయారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుపోతున్నారు. ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనపించాయి

– కొత్తూరు

ముగిసిన బంగారమ్మ తల్లి పండగలు



ముర్రాటలు తీసుకువెళ్తున్న మహిళలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీ తీరంలో కొలువైన బంగారమ్మ తల్లి అమ్మవారి పెద్ద పండుగలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన పండుగలు మంగళవారం వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు మంగళవారం సాయంత్రం మహిళలు ముర్రాటలు తీసుకుని అమ్మవారికి చల్లదనం చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సర్పంచ్ ముగడ దివాకర్ నాయుడు, కమిటీ సభ్యులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే కీలకం



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఓ సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్‌దొర అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, సోంపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు టి.ఇమ్మాన్యుల్‌రాజు, హెచ్.మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం రూరల్, టౌన్, కవిటి, కంచిలి, సోంపేట ఎస్ఐలు ఎన్.లక్ష్మణ్, సత్యనారాయణ, రాము, రాజేష్, బడ్డ హైమావతి పాల్గొన్నారు.